క్లుప్తంగా

ఆలయాల్లో భక్తుల పూజలు



అలంకరణలో వేనూతల కాటమరాజుస్వామి

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవానీ, మండల కేంద్రం పెద్దారవీడు సమీపంలో వెలసిన అంకాళమ్మకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి స్వామి, అమ్మవారికి అభిషేకాలు చేశారు. కుంకుమ, పసుపు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు తయారు చేసి స్వామికి సమర్పించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు, అభికాలు, కుంకుమ పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు కుంకుమబండ్లతో సత్యమాంబదేవి ఆలయం వద్దకు తరలి వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

గురుకుల పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

కంభం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో (బాలికలు) 6,7 తరగతుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి మిగులు సీట్లు భర్తీ చేసేందుకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి. చాముండేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం జెరాక్సు కాపీలతో ఈనెల 25వ తేదీ సాయంత్రం లోపు గురుకుల పాఠశాలలో సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు రాత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

అర్థవీడు (బేస్తవారిపేట): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి తెలిపారు. ఈనెల 25వ తేదీ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 26వ తేదీన ఉదయం 10 గంటలకు పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణంలో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ దేవాలయంలో పోలేరమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలు, పూలమాలలు, నిమ్మకాయ దండలతో అలంకారం నిర్వహించారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు కుంకుమ బండ్లతో రంగులు చల్లుకుంటూ వచ్చి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు, నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారికి అర్చన, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

రహదారి గుంతలమయం



చెరువుకట్ట రోడ్డుపై గుంతలు పడిన దృశ్యం



చెరువుకట్ట రోడ్డుపై పలు ప్రాంతాల్లో ఏర్పడిన గుంతలు

- అధ్వానంగా గుంతలు పడిన చెరువుకట్ట రహదారి
- అవస్థలు పడుతున్న ప్రజలు
- ఈ రోడ్డుపై ప్రతిరోజూ వెయ్యికి పైగా వాహనాల రాకపోకలు

మార్కాపురం: నియోజకవర్గ కేంద్రం మార్కాపురం నుంచి ఒంగోలు, మార్కాపురం నుంచి రైల్వే స్టేషన్‌కు, మార్కాపురం నుంచి సుమారు 15 గ్రామాలకు పైగా ప్రజలు వెళ్లే ప్రధాన రహదారి చెరువుకట్ట రోడ్డు. ఇటీవల కాలంలో ఈ రోడ్డుపై గుంతలు పడటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా చెరువుకట్ట రోడ్డు ఉంది. ఈ రోడ్డుపై ప్రతి పది నిమిషాలకు పది ఆటోలు, సుమారు 20 బస్సులు, 50కి పైగా టూవీలర్లు ప్రయాణం చేస్తుంటాయి. మార్కాపురం నుంచి ఒంగోలుకు, మార్కాపురం నుంచి రైల్వే స్టేషన్‌కు పలకల గనులతోపాటు రాయవరం, గజ్జలకొండ, పోతలపాడు, బుడ్డపల్లి, గానుగపెంట, నాయుడుపల్లి, మన్నెంవారిపల్లి తదితర గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు వాహనదారులు ఈ రోడ్డుపై నుంచి వెళ్లాల్సిందే. సుమారు ఐదారు ప్రాంతాల్లో అడుగులోతు గుంతలు పడటంతో టూ-వీలర్లు, ఆటో డ్రైవర్లు భయంతో వాహనాలను నడపాల్సి వస్తోంది. ఈ రోడ్డు ప్రమాదకరంగా మారింది. తరచూ రాత్రిపూట ఈ గుంతల్లో పడి పలువురు క్షతగాత్రులవుతున్నారు. ప్రధానమైన రహదారి కావడంతో గుంతలు పడినప్పటికీ తప్పని సరిగా ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఈ రోడ్డు మీదుగా మార్కాపురం, తర్లుపాడు మండలాలకు చెందిన సుమారు 15 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు, కూలీలు, పలకల వ్యాపారులు ఈ రోడ్డుపై నుంచే వెళ్లాల్సి ఉంటుంది. కాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎన్నడూలేని విధంగా అప్పటి ఎమ్మెల్యే కేపీ నాగర్జున రెడ్డి మొదటిసారిగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లు వేయించడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు తగ్గాయి. అలాగే చెరువుకట్టపై ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి డ్రైవర్స్ కాలనీ చివరి వరకూ రూ. 5 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయించారు. కాగా పట్టణంలోని ఆకాశవాణి కేంద్రం వద్ద ఉన్న అలుగు వద్దనుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఎక్కువ సంఖ్యలో గుంతలు పడ్డాయి. మెట్ల వద్ద కూడా గుంతలు పడ్డాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని ప్రయాణికులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

బూచేపల్లికి అభినందనలు

దర్శి: దర్శి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత పట్టణానికి వచ్చిన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిని ఆదివారం పలువురు కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాకపోవడం బాధగా ఉందని, అయితే దర్శి నియోజకవర్గంలో బూచేపల్లి గెలవడంతో కాస్త ఆనందంగా ఉందని వారు అన్నారు. రాష్ట్రంలోని మహిళలు, వివిధ పథకాల లబ్ధిదారులంతా వైఎస్సార్ సీపీకి వేసిన ఓట్లు ఏమయ్యాయంటూ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితో పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈవీఎంలలో ఏదో తేడా జరిగిందని అనుమానాలు వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా పథకాలు అందించిన జగనన్న అధికారంలోకి రాకపోవడాన్ని నమ్మలేకపోతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అందరూ సమన్వయంతో ఉండాలని, మళ్లీ జగనన్నను సీఎం చేసుకునే అవకాశాలున్నాయని అన్నారు.

గంగమ్మదేవత గుడి పునర్నిర్మాణం



నిర్మాణంలో ఉన్న గంగమ్మగుడి



గంగమ్మదేవత పాత ఉత్సవ విగ్రహం

పుల్లలచెరువు: పుల్లలచెరువులోని చిన్నకండ్లేరు ప్రాజెక్టు వద్ద దాతల సహకారంతో గంగమ్మ దేవత గుడి పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పుల్లలచెరువుకు దగ్గరలో నల్లమల అడవిలో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో 1961 లో చిన్నకండ్లేరు ప్రాజెక్టును నిర్మించారు. ఆ సమయంలో కాంట్రాక్టర్ గంగమ్మగుడిని నిర్మించగా అది కాలక్రమేణా జీర్ణావస్థకు చేరింది. గుడి ఆ విధంగా ఉండడం మంచిది కాదనే ఉద్దేశంతో గ్రామపెద్దలు కె.రఘు, కె.కుమార్, జి.గురునాథం, డిష్‌చిన్నాలు గుడిని పునర్నిర్మించేందుకు ముందుకొచ్చి ఆ దిశగా పనులు మొదలుపెట్టారు. ఈ గుడి నిర్మాణం పూర్తయితే నందనవనంగా తయారుచేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా ఉండేలా తయారుచేస్తామని, దాతలు తమవంతు సహాయం అందజేయాలని వారు కోరుతున్నారు. త్వరలో ఈ గుడి నిర్మాణం పూర్తి చేసుకోనుంది.

సేవా భావంతో పనిచేయాలి



మాట్లాడుతున్న కల్లం సుబ్బారెడ్డి

పొదిలి: సేవా భావంతో పనిచేయటం ద్వారా సంస్థకు రెట్టింపు ఖ్యాతి వస్తుందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కల్లం సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక దర్శి రోడ్డులోని శ్రీకృష్ణ గోసంరక్షణ కేంద్రంలో ఆదివారం సంస్థ సేవా కార్యక్రమాలపై సమీక్ష సమావేశం జరిగింది. సుబ్బారెడ్డి మాట్లాడుతూ తక్కువ కాలంలోనే సంస్థలో 1000 మంది సభ్యులుగా చేరారని, మరింత రెట్టింపు ఉత్సాహంతో మరో వెయ్యిమందిని సభ్యులుగా చేర్చుకోవడం ద్వారా పొదిలి శాఖను ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. పేదలకు, అనాథలకు సేవలు అందించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు పోవాలన్నారు. కమిటీ సభ్యులు, డైరెక్టర్లు, అతిథులు సంస్థ గత సంవత్సర కాలంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలను గురించి వివరించారు. జిల్లా మానవత సంస్థ అధ్యక్షునిగా ఎన్నికైన కె.యల్లమందారెడ్డిని సన్మానించారు. కమిటీ కాలం పూర్తయినందున, కొత్త కమిటీని ఎన్నుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ మువ్వల పార్థసారధి, డైరెక్టర్లు, సభ్యులు జీసీ సుబ్బారావు, గునుపూడి భాస్కర్, సామంతపూడి నాగేశ్వరరావు, కాటూరి పెద్దబాబు, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తానికొండ వెంకటరావు, సోమిశెట్టి చిరంజీవి, బండి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూలసుబ్బయ్య వర్ధంతి



పూలసుబ్బయ్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు.




పూల సుబ్బయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

యర్రగొండపాలెం: పశ్చిమప్రాంత ప్రజల ఆశాజ్యోతి అయిన వెలుగొండ ప్రాజెక్టు ఉద్యమనేత అమరజీవి పూలసుబ్బయ్య 37వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య మాట్లాడుతూ పూలసుబ్బయ్య కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం భారత కమ్యూనిస్టు పార్టీలో(సీపీఐ) చేరి తుదిశ్వాస వరకు అదే పార్టీలో కొనసాగారన్నారు. పేద ప్రజల సమస్యల కోసం నిరంతర పోరాటం చేశారని అన్నారు. ఈ సభలో సీపీఐ నాయకులు నక్కా తిరుపతయ్య, ఎం.వెంకటేశ్వర్లు, వై.వెంకటశివయ్య, ఆవుల యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

పూలసుబ్బయ్య ఆశయాలు కొనసాగిద్దాం

మార్కాపురం: దివంగత మాజీ ఎమ్మెల్యే సీపీఐ నేత పూలసుబ్బయ్య ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య అన్నారు. పూలసుబ్బయ్య 37వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న పూలసుబ్బయ్య దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశంలో అన్ని రంగాల్లో అవినీతి విలయ తాండవం చేస్తోందని, ఆర్థిక అవినీతి కన్నా రాజకీయ పార్టీల నాయకుల అవినీతి అత్యంత ప్రమాదకరమన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను పూర్తిగా విస్మరించి వేలకోట్ల రూపాయలు ఖర్చు చేశారన్నారు. ప్రజా సమస్యలపై ఏమాత్రం అవగాహన లేనివారు ప్రజాప్రతినిధులుగా విజయం సాధించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఒకప్పుడు ఎన్నికల్లో ప్రజలతో మమేకమై ఉండే వ్యక్తులను పార్టీలను ప్రజలు అసెంబ్లీకి, పార్లమెంటుకు పంపేవారన్నారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన మహనీయుడు పూలసుబ్బయ్య అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎమ్‌ఎల్ నారాయణ, పార్టీ నాయకులు అందె నాసరయ్య, ఎస్.కె ఖాశీం, కె. ఎర్రయ్య, సీపీఎం నాయకులు జి. బాలనాగయ్య, పూల సుబ్బయ్య కుమార్తెలు సుభాషిణి, సునందిని తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి అచ్చమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలు



అచ్చమాంబ పేరంటాలు మూల విగ్రహమూర్తి

పామూరు: మండలంలోని బొట్లగూడూరు పంచాయతీ పరిధిలోని రఘునాథపురం కమ్మవారి పాలెంలోని అచ్చమాంబ దేవస్థానంలో అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు 26వ తేదీ బుధవారం నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అడుసుమల్లి నరసింహులు, చెంచయ్య పేర్కొన్నారు. 26వ తేదీన నిలుపు, పసుపు కుంకుమ, సారెకావెళ్లు, 27న గణపతిపూజ, పుణ్యాహవచనం, గ్రామోత్సవం, 28న అమ్మవారికి అభిషేకం, గ్రామోత్సవం, 29న కల్యాణోత్సవం, కుంకుమార్చన, పసుపు కుంకుమ, పెద్ద ఉత్సవం, 30న బండ్లు, పొంగళ్లు, రాష్ట్రస్థాయి ఎడ్లపందేలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని దేవస్థాన కమిటీ తెలిపింది.



తిరునాళ్లకు ముస్తాబవుతున్న అచ్చమాంబ ఆలయం

వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే బూచేపల్లి



కరిష్మాను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: పట్టణంలో జరిగిన మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ షకీలా అమీన్‌బాషా కుమార్తె కరిష్మా వివాహ వేడుకలకు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. వారి నివాసంలో పెండ్లి కుమార్తెను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారు ఇచ్చిన విందు స్వీకరించారు.

గోశాలకు కరీముల్లా బేగ్ ఆర్థిక సాయం



కరీముల్లా బేగ్‌ను సత్కరిస్తున్న భాస్కర్

పొదిలి: స్థానిక దర్శి రోడ్డులో శ్రీకృష్ణ గోసంరక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ యాభై గోవులను పోషిస్తున్నారు. గోమాతల కోసం అవసరమైన నవదాన్యాల కొనుగోలు కోసం హబీబుల్లా బేగ్ సంస్థ చైర్మన్ కరిముల్లా బేగ్ ఆర్థిక సాయం అందించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన నగదును నిర్వాహకులకు అందించారు. ఈసందర్భంగా కరీముల్లాబేగ్ దాతృత్వాన్ని కొనియాడిన నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గునుపూడి భాస్కర్, యక్కలి శేషగిరిరావు, మువ్వల పార్థసారధి, అప్పల శంకర్, గూడూరి వినోద్, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పడియిమర్రి తిరుపాలు పాల్గొన్నారు.

ప్రతి రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించాలి

కందుకూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని కచ్చితంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ విద్యాధరి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావాలని, అధికారుల హాజరును ధ్రువీకరిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ప్రతి సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కూడా ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉలవపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా పరిష్కార ఫిర్యాదు వ్యవస్థ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రారెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని రకాల ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు. ఫిర్యాదులను ప్రత్యేక ఐడీలతో నమోదుచేస్తామని, ఈ ఐడీల ద్వారా ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేయవచ్చని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

పెద్దదోర్నాల: సమస్యలను పరిష్కరించటంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఎంపీపీ గుమ్మా పద్మజ అధికారులను కోరారు. ఆదివారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో జరిగిన మండల ప్రజా పరిషత్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను తొలగించాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, పరుచూరి సురేఖ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

గుద్లూరు: మండలంలోని చెమిడిదిపాడు వద్ద ఆంజనేయ స్వామి గుడి వద్ద హనుమాన్ చాలీసా పారాయణం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామిని పట్టు వస్త్రాలు, పూలు, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ కోటి హనుమాన్ చాలీసా పారాయణ యజ్ఞంలో భాగంగా 2022లో ఏకాదశి రోజున ప్రారంభమై నేటికి 108 ఆదివారాలు హనుమాన్ చాలీసా పారాయణం పూర్తయిందన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆలయం వెనుక వైపు పంచముఖి ప్రసన్న ఆంజనేయ స్వామి నూతన ఆలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఆలయ ట్రస్టు చైర్మన్ ఆలూరు హనుమంతురావు తెలిపారు.

భైరవకోనకు పోటెత్తిన భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలో ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రం భైరవకోనకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో భైరవకోనకు వచ్చారు. ఈసందర్భంగా జలపాతంవద్ద స్నానమాచరించి అనంతరం త్రిముఖదుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గుంటూరుకు చెందిన అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు జ్ఞాన ప్రసన్నగిరి, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మండలంలోని పురాతన పుణ్యక్షేత్రం అయ్యలూరివారిపల్లె వద్ద ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.